# పాగుంట వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే బండ్ల

■ 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్న బీఆర్ఎస్ నాయకుడు



పాగుంట వెంకన్న స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి, డిసెంబర్ 7 : మండలంలోని పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని గద్వాల ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచిన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గురువారం దర్శించుకొన్నారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. స్వామివారి దీవెనలతో మరింత ముందుకు వెళ్తానని, మండల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని చెప్పారు. ఎమ్మెల్యేగా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మళ్లీ గెలిస్తే 101కొబ్బరికాయలు కొడుతా అని వెంకటాపురం బీఆర్ఎస్ నాయకుడు గోపి మొక్కుకోగా ఎమ్మెల్యేగా బండ్ల గెలవడంతో గురువారం ఆ మొక్కు తీర్చుకున్నాడు. ఆయన వెంట వెంకటాపురం సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, శ్రీధర్ కులకర్ణి, గోపి, భగవంతు తదితరులు ఉన్నారు.

### ఎమ్మెల్యే బండ్లకు బ్రాహ్మణుల ఆశీర్వాదం

మల్దకల్, డిసెంబర్ 7 : గద్వాల ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఆదిశిలా క్షేత్రం బ్రాహ్మణోత్తములు ఆశీర్వదించారు. స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం తరపున చైర్మన్ పట్వారీ ప్రహ్లాదరావు ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే బండ్లను స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి, పంచామృతాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సత్యచంద్రారెడ్డి, అర్చకులు మధుసుదనాచారి, రవి, శశాంకదాస్, చంద్రశేఖర్‌రావు, రాముడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాంప్ కార్యాలయంలో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న బ్రాహ్మణులు

# జములమ్మకు ఎమ్మెల్యే పూజలు

■ ఎమ్మెల్యే విజయుడును సన్మానించిన అర్చకులు



కంచుపాడులో జములమ్మకు పూజలు చేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, డిసెంబర్ 7 : మండలంలోని కంచుపాడు గ్రామంలోని జములమ్మ దేవతను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు గురువారం దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జములమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేను సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# పల్లెల్లో ప్రారంభమైన గొడవలు

■ బీఆర్ఎస్ నేతల ఆటోలు, స్కూటీకి నిప్పుపెట్టిన దుండగులు

అమరచింత, డిసెంబర్ 7 : ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో గొడవలు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలు జరిగి వారం కూడా తిరగక ముందే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య గొడవలు మొదలైనట్లు కనిపిస్తున్నది. బుధవారం అర్ధరాత్రి మండలంలోని ధర్మాపూర్‌లో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు దళిత గోపి, దళిత సోమన్నకు చెందిన రెండు ఆటోలు, ఒక స్కూటీని వారివారి ఇండ్ల ముందు నిలుపుకోగా గుర్తు తెలియని దుండగులు వాహనాలను గ్రామ శివారులోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పుపెట్టడంతో వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గురువారం నిద్ర లేచిన కుటుంబ సభ్యులు ఇంటిముందు వాహనాలు కనిపించకపోవడంతో గ్రామంలో వెతుకుతుండగా ఊరి చివర కాలిపోతున్న వాహనాలను చూసి బాధితులకు సమాచారం ఇచ్చారు. అగ్నికి ఆహూతవుతున్న వాహనాలను చూసి బోరున విలపిస్తు, ఇక తమ కుటుంబ సభ్యులను ఎలా పోషించుకోవాలంటూ గొల్లుమన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు సమ్మెలన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆత్మకూర్ సీఐ రత్నం తమ సిబ్బందితో కలిసి ధర్మాపూర్ గ్రామాన్ని సందర్శించి బాధితులు, గ్రామస్తుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని క్లూస్ టీం ద్వారా విచారణ నిర్వహిస్తామని చెప్పారు. అయితే ఇది కాంగ్రెస్ నాయకుల పనేనని కొందరు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య బాధిత కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని అన్నారు. ఏది ఏమైనా గ్రామాల్లో ఇన్నాళ్లు అన్నదమ్ముల్లా కలిసి ఉన్న ప్రజలు ఎన్నికలు ముగియగానే ఇలా జరగడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధర్మాపూర్‌లో దుండగులు నిప్ప పెట్టడంతో పూర్తిగా దగ్ధమైన ఆటో

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

■ వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య



అండర్-14 వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన బాలనగర్ బాలికల జట్టు

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 7: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జిల్లా వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య అన్నారు. గురువారం అండర్-14 ఉమ్మడి జిల్లావాలీబాల్ బాల, బాలికల జట్ల టోర్నీకమ్ సెలక్షన్ స్థానిక స్టేడియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాక్షించారు. పోటీల్లో బాలుర విభాగంలో విజేతగా నవాబ్‌పేట, రాజాపూర్ రన్నర్‌గా, బాలికల విభాగంలో విజేతగా బాలనగర్ విజేత, రన్నర్‌గా కోయిలకొండ జట్లు నిలిచాయి. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, పరశురాం, గజానంద్, నిరంజన్‌రావు, ఆయూబ్, ఆంజనేయులు, సోమ్లా, ఉమాపతిరెడ్డి, సుచేతన్, జగన్‌మోహన్‌గౌడ్ అబ్దుల్లా, గీత, రాములు, రవినాయక్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

■ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వనపర్తి, డిసెంబర్ 7 : ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతి నిత్యం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడు ప్రజలు, పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని, అందుబాటులో ఉండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయాలని చెప్పారు. తానూ ఎల్లవేళలా ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు. ఎప్పటిలాగానే ప్రతి గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. పార్టీ కోసం పనిచేసేవారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు గత తొమ్మిదిన్నర ఎండ్లలో చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలు కొనసాగే విధంగా అధికారులను సంప్రదించి ముందుకు సాగేలా కృషి చేయాలని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు నందిమళ్ల అశోక్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ చిన్నారెడ్డి, మల్లయ్య, దేవర్ల నర్సింహ, నక్క మహేశ్, సురేశ్, బాలస్వామి, సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో పారుతున్న నీరు

# జూరాలకు తగ్గుతున్న ఇన్‌ఫ్లో..

ధరూరు, డిసెంబర్ 7 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి ప్రాజెక్ట్‌కు 858 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 1,309 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. కాగా ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 161క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 691క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 858క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 8,087టీఎంసీలకు గానూ ప్రస్తుతం 4,380 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## ఆర్డీఎస్‌కు కొనసాగుతున్న వరద

అయిజ, డిసెంబర్ 7 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్ ఫ్లో కొనసాగుతున్నది. గురువారం ఆర్డీఎస్ ఆనకట్టకు 290 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 385 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 429 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.1 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.

## తుంగభద్ర డ్యాంకు..

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 530 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 2,347క్యూసెక్కులు నమోదైనది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 12.817 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1,592.04 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# పీయూలో అథ్లెటిక్స్ ఎంపికలు

పాలమూరు, డిసెంబర్ 7 : పాలమూరు విశ్వవిద్యాలయంలో గురువారం ఆల్ ఇండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు అథ్లెటిక్ విభాగంలో ఎంపికలు నిర్వహించినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. అథ్లెటిక్స్‌కు ఎంపికైన క్రీడాకారులు టీఎస్‌పీఈఎస్ యూనివర్సిటీ చెన్నై, యూనివర్సిటీ ఆఫ్ కారికట్ కేరళలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో కోచ్ సునీల్, శ్రీనివాస్, శ్వేత, చంద్రకళ, కవిత, పీడీ సత్యభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉమ్మడి జిల్లా రగ్బీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 7 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేడు (శుక్రవారం) ఉమ్మడి జిల్లా బాలుర హ్యాండ్‌బాల్, 7న ఉమ్మడి జిల్లా రగ్బీ బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు స్టేడియంలో ఎంపికలు ఉంటాయని, విద్యార్థులు పాఠశాల బోనఫైడ్, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ : 9441565282 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.